
రమ్మంది. కన్నీళ్ళతో ఇచ్చేసి వచ్చింది. ఇహ టి.వి., వుస్తకాలు ఎంతసేపనీ? స్కూల్లో కూడా వయసుకు చిన్నవాళ్ళెగానీ ఎంత స్వార్థపరులు? ఎంతటి కుటిల లౌక్యులు? ఆ క్లాస్‌మేట్స్? సంధ్య దగ్గర డబ్బులుంటేనే వస్తారు, ఐస్‌క్రీమ్ ఇప్పించవే అని. బెల్లంమీద ఈగల్లా ముసురుతారు. ఇప్పిస్తే తినేసి పోవడమే. ఒక్కతి కూడా మనసారా మాట్లాడదు. పైగా సంధ్య కోసం వచ్చే కారు చూసి ఈర్ష్య. ఏం చేస్తుంది? ఆ శూన్యాన్ని భరించలేక ఒక్కతీ ఏడ్చుకుంటుంది. ఈమధ్య కాలక్షేపం కోసం టెర్రస్ మీద కాస్త తిరగడం మొదలెట్టింది.

అదుగో అప్పుడు మొదలైంది అతడితో పరిచయం; ముఖ పరిచయమే. అచ్చం సినిమా యాక్టర్ హరీష్‌లా వుంటాడు. అస్తమానం ఆ పిల్లని చూపుల్తో వెంటాడటం, చిరునవ్వులూ, సైగలూ, కన్నుగీటటం, స్టెప్ బై స్టెప్ పుంజుకున్నాయి. ఆ **పిల్లకిదంతా** తమాషాగా వుంది. థ్రిల్లింగ్‌గా, గమ్మత్తుగా వుంది. తనకి తనే కొత్తగా వుంది. అద్దంలో చూసుకుంది. పధ్నాలుగేళ్ళ అమ్మాయి ఎలా వుండాలో అలాగే వుంది. కాకపోతే నానమ్మ వున్నప్పుడు పొడవాటి జడలుండేవి. తల దువ్వ లేక బాబ్డ్ చేయించేసింది సంధ్య తల్లి. తన ఆశలు, ఆలోచనలూ పంచుకునే వారెవ్వరూ లేరు. ఈ ఒంటరితనం పిచ్చి పిచ్చిగా వుంది. ఈ శూన్యం భరించలేనిదిగా వుంది సంధ్యకి. టి.వి. పెట్టుకుంటే అస్తమానం కౌగిలించుకోవడం, ముద్దులు పెట్టుకోవడం లేదా గుర్రాల్లా పరిగెడ్తూ పచ్చికపై దొర్లడం, యమ్ టీవీ, స్టార్ టీవీ, ఎన్ టీవీ, జీ టీవీ అన్నిట్లో ఇదే తంతు. మొదట్లో కుతూహలంగా చూసినా, రానురాను **విసుగేస్తుంది**. పైగా ఎవ్వరూ తనలాగ ఒక్కరూ వుండరు. జంటలుగానో, గుంపులుగానో హాయిగా పాడుతూ, ఆడుతూ వుంటారు. వాళ్ళని చూస్తుంటే తన ఒంటరితనరం మరీ బాధిస్తుంది.

సంధ్య మమ్మీకి ఎంత సేపూ ఉద్యోగం, పేషంట్స్, ఆపరేషన్స్–డబ్బు, డబ్బు! అన్నీ, అవసరాలూ తీరుతున్నా, ఆప్యాయంగా చేరదీసి ఆత్మీయంగా మాట్లాడి ముద్దాడి ఎరగదు. తల్లిదండ్రుల ప్రేమానురాగాలకోసం ఎంతో ఆరాట పడుతుంది ఆ పిల్ల హృదయం. కానీ అదేమీ పట్టించుకోదు ఆ పిల్ల తల్లి. కట్నం రేట్లు పెరిగిపోయాయి. రేపు సంధ్యకి ఎంతివ్వాల్సి వస్తుందో–అని డబ్బు సంపాదనలోనే పడిపోయింది. అత్తగారంటే పడేది కాదు. ద్వేషించేది. ఆమె లేకపోతే తనకి ఈ భర్త ఎలా వచ్చాడన్న జ్ఞానం లేదామెకి.




అసలు నానమ్మే ఇంట్లోవుంటే ఎంత బాగుండేది. ఎంత మంచి ఫ్రెండు నానమ్మ తోడూ, నీడగా బెస్టు ఫ్రెండులా వుండేది. ఇప్పుడీ ఒంటరితనం భరించలేనిదిగా పిచ్చి పిచ్చిగా వుంది సంధ్యకి.

ఆ రోజు సెకండ్‌సాటర్‌డే. ఇంట్లోనే వుంది సంధ్య. ఇంటి ముందు కారాగింది. అందమైన స్త్రీతోపాటుగా తండ్రి దిగాడు. ఆమెను తన బెడ్‌రూమ్‌లోకి తీసికెళ్ళాడు. అప్పుడప్పుడూ అలా జరుగుతూనే వుంటుంది. ఆ రాత్రి తల్లి అరుపులూ, ఏడుపులూ వినలేం. తల్లిదండ్రుల మాస్టర్ బెడ్‌రూమ్‌లో ఫ్రిజ్, ఏసితో సహా అన్ని వసతులూ వున్నాయి. లోపల్నుంచి ఆమె నవ్వులు వినిపిస్తున్నాయి. ఒంటికి కారం రాసినట్లు చిరచిర లాడింది సంధ్య. తండ్రి ఏదో చేయరాని పనిచేసినట్టు **అర్థమౌతూంది**. ఆ గది దగ్గరకు రావద్దని తండ్రి ఆజ్ఞ. ఎవరిమీదో తెలీని కసి రగులుతూంటే– టి.వి. ఆన్‌చేసింది. క్రమంగా వెలుతురు నిండిన స్క్రీన్‌పై ఒక జంట. ఆమె మెల్లగా వెనక్కు ఒరిగింది. హీరో ఆమె మీదికి వాలాడు. ఎత్తయిన వక్షోజాల మధ్య అతని తల, వెనకనుండి వుత్సాహం వురకలెత్తేలా సంగీతం... అతడామెను గాఢంగా ముద్దుపెట్టుకుంటున్నాడు.

తండ్రి తలుపు తీస్తున్న శబ్దం. చటుక్కున టి.వి. ఆఫ్ చేసింది.

ఆమె తన తండ్రి భుజాలపై ఒరిగి నడుస్తూంది. కారులో కూచున్నారు.

మెత్తగా కదిలి, అలా–అలలా వెళ్ళిపోయిందది.

చూస్తున్న సంధ్యకి ఏదైనా చేసేయాలని కసి కల్గింది. చేతిలోని స్టీలు గ్లాసు విసిరికొట్టింది. టేబుల్ మీది పుస్తకాలు, మంచంమ్మీద దిండు, పౌడర్ డబ్బా, దువ్వెనా విసిరికొట్టింది. ఇంకేం చేయగలదు?

నెమ్మదిగా టెర్రస్ మీదకు వచ్చింది.

వర్షాకాలం ప్రారంభమవడంతో–ఆకాశమంతా ఏనుగుల గుంపుల్లా నల్లని మేఘాలు, చల్లటి గాలులు వీస్తున్నాయి. విద్యుల్లతలు తటిల్లున మెరుస్తున్నాయి. ఎంతో ఆహ్లాదంగా వుంది వాతావరణం. అదామె మనసుకు ఉపశాంతి కల్గిస్తూంది. దూరంగా నీలం రంగులోవున్న కొండల్లు, పక్కనే తాటిచెట్లు, అద్దం ముక్కలా మెరుస్తున్న చెరువు, నాస్తికుడు సైతం భగవంతుని అద్భుత సృష్టి అందానికి మొక్కే సమయమది. అలౌకికానందంతో అలా నడుస్తూ పిట్టగోడవైపు వెళ్ళి, కొబ్బరాకుల సందుల్లోంచి అతడి రూంవైపు చూసింది. ఎప్పట్నుంచి అతడు అలా నిలబడి నిర్నిమేషంగా ఆ పిల్లని చూస్తున్నాడో...! సంధ్య తనని చూడగానే చిరునవ్వు చిరదించాడు. ఉత్త ప్యాంటుతో వున్నాడు. నగ్నంగావున్న ఛాతీ! రమ్మంటూ సైగ చేశాడు. కన్నుగీటాడు.

గుండె ఝల్లుమందా పిల్లకి. ఏదోలా వుంది. గిరుక్కున వెనుదిరిగి క్రిందకొచ్చేసింది. క్లాసు పుస్తకాలు తీసింది. అక్షరాలు అలుక్కుపోయినట్లు గజిబిజిగా వున్నాయి. పక్కన పడేసింది. టీవీ ఆన్‌చేసింది. సముద్రపు నీళ్ళలో కేరింతలు కొడుతున్న హీరో, హీరోయిన్లు. ఛానల్ మార్చింది. ఎవరో ఆర్తిగా ప్రేమగీతం పాడుతున్నారు. వింటున్న సంధ్యకి తెలీకుండానే కన్నీళ్ళు వచ్చాయి. టీపాయ్‌మీది వీక్లీని చేతిలోకి తీసుకుంది. "టీనేజ్ ఆడపిల్లల గర్భస్రావాలు, అక్రమ సంతానం–ఇది అంతర్జాతీయ సమస్య–" ఆ వార్త చదవలేదా అమ్మాయి. ప్రక్కనేవున్న "కామసూత్ర" అడ్వర్టయిజ్‌ని చూస్తుంది తదేకంగా.

నెమ్మదిగా లేచి అద్దం ముందు నిల్చుంది "ఈ ప్రేమ ఇంత గొప్పదా?" తన ప్రతిబింబాన్ని అడిగింది. తన గదిలో కెళ్ళి ఏరి ఏరి మంచి డ్రస్ ధరించింది. చక్కగా పౌడర్, కాటుకా దిద్దుకుంది. తల్లివాడే సెంటు 'స్ప్రే' చేసుకుంది.

అద్దంలో అటూ ఇటూ తిరిగి చూసుకుంది. ఆ చల్లని వాతావరణంలో వేడి వేడి కాఫీ త్రాగాలనిపించింది. ఫ్రిజ్‌లో పాలు తీసి స్టౌమీద పెట్టింది. కూనిరాగం తీస్తూ ముఖద్వారం వైపు వచ్చింది. గాలికి తల లూపుతున్న గులాబీలు కన్పించాయి పెరట్లో. ఓ గులాబీ తుంచి పెట్టుకోవాలనిపించింది. గులాబీని తుంచి అలఓకగా తలలో తురుముకుంటూ అతడి గదివైపు చూసింది. ఆమె అలంకరణని ప్రశంసగా చూస్తూ చిలిపిగా నవ్వాడు. రమ్మన్నట్లుగా రెండు చేతులూ సాచాడు. ఆ పిల్ల తన్ను తాను మర్చిపోయింది. ఈ ఒంటరితనం నుండి, శూన్యం నుండి–పారిపో, వెళ్ళు అని ఎవరో హిప్నటైజ్ చేసినట్లు ఆ పిల్ల అతడి వైపుగా అడుగువేసింది.


'ఆగు'! అన్నట్లుగా తొలి చినుకు ఆమె నెత్తిన పడింది.

"నిన్నే! ఆగు!" అన్నట్లుగా గాలి విసురుగా వీచింది.

ఆ పిల్ల గడప దాటింది. అతడి చేతుల్లోకి చేరింది. మలి సంధ్యని మబ్బులు మింగేశాయి.

వంట గదిలో పాలు పొంగిపోయాయి!

పై నుండి చూస్తున్న నానమ్మ గుండె బద్దలైనట్లు హఠాత్తుగా పెరిగింది వర్షం.




## సమయం సాయంత్రం 4-00

ధీరజ్ కాలేజ్ నుంచి బయటకు వచ్చే సరికి సాయంత్రం నాలుగు గంటలు అయింది. లైట్ బ్లూ కలర్ జీన్స్ మీద రెడ్ కలర్ కాటన్ షర్ట్ దాని మీద నిలువుగా అడ్డంగా ఎల్లో కలర్‌లో గీతలున్నాయి. పైన వైట్ శాప్రాన్ కోట్ వేసుకున్నాడు. చేతిలో స్టెతస్కోప్ వుంది. ఆ రోజు కాలేజీకి బస్ మీదే రావడంవల్ల మళ్ళీ బస్‌లో వెళ్ళడం కోసం బస్టాండ్‌కి నడిచాడు.

అక్కడ చూశాడు ధీరజ్ అతని పక్కనే బస్టాండ్‌లో కాస్త దూరంలో ఓ అమ్మాయి నిల్చుని వుంది. చాలా లవ్లీగా వుంది. లైట్ పింక్ కలర్ పంజాబీ డ్రస్‌లో వుంది. అతన్నే చూడసాగింది.

అతను ఆ అమ్మాయి వైపు సూటిగా చూడలేక తలదించుకున్నాడు. ఆమెను నెమ్మదిగా తలవంచుకుని పక్క చూపులు చూస్తూ కళ్ళజోడు లోంచి చూడసాగాడు.

బస్ అంతా రష్‌గా వుంది. అంతకు ముందు బస్టాండ్‌లో ధీరజ్‌ని గమనిస్తున్న అమ్మాయి కూడా అదే బస్ ఎక్కింది.

కండక్టర్ ముందుకు జరగమని గొడవ చేస్తుంటే ముందుకి జరిగాడు.

పక్కనే అతన్ని తాకుతూ నిలబడ్డ శరీరాన్ని చూసి ఉలిక్కి పడ్డాడు. అతని పక్కన వున్నది పింక్ కలర్ పంజాబీ డ్రస్ అమ్మాయి.

ఒక్క క్షణం గుండె ఆగినట్లయింది. గొంతు తడి ఆరిపోతున్నట్టుగా వుంది. జేబులోంచి కర్చీఫ్ తీస్తుండగా చేయి ఆమెకు తగిలింది. ఉలిక్కి పడ్డాడు. ఆమె వెనక్కు తిరిగి చూసింది. ఆమె చూపుల్లోంచి తప్పించుకుంటూ జేబులోని కర్చీఫ్ బయటకు లాగాడు. "టికెట్ ప్లీజ్" కండక్టర్ టికెట్ అడుగుతున్నాడు.

ధీరజ్ దగ్గరకు వచ్చి అడిగాడు.

ధీరజ్ జేబులో చేయి పెట్టి పర్సు తీయబోయాడు. పర్సు చేతికి తగలలేదు. హడావిడిగా జేబులన్నీ వెతికాడు. ఎంత వెతికినా పర్స్ మాత్రం కనిపించలేదు.

అందులో పది రూపాయిలు కొంత చిల్లర మించి డబ్బులు లేవు. ఎవరో పర్స్ కొట్టేశారు.

"పైసే గిర్ గయా క్యా..." అడిగాడు కండక్టర్ నవ్వుతూ.

పర్స్ పోయిందంటే డబ్బులు ఎంత వున్నాయని అడుగుతాడు, అందులో పది రూపాయిలున్నాయంటే బాగోదు.

తొందరగా సమాధానం చెప్పకపోవడంతో తిరిగి ప్రశ్నించాడు కండక్టర్ - క్యాహువా ...

"అబ్బే.. డబ్బులు కనిపించడం లేదు" చెప్పాడు ధీరజ్.